క్లుప్తంగా

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన గణేష్ యాదవ్


మంత్రి పెద్దిరెడ్డితో గణేష్ యాదవ్

పలమనేరు: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు గణేష్‌యాదవ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసినట్టు మంగళవారం తెలిపారు. పలమనేరులో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని, సంబరాలకు తామంతా సిద్ధంగా ఉన్నట్టు మంత్రికి చెప్పానన్నారు.

భక్తిప్రపత్తులతో ధ్వజారోహణం


ధ్వజారోహణ పూజలు చేస్తున్న వేదపండితులు

బైరెడ్డిపల్లి: మండలంలోని బేలుపల్లె సమీపంలో పట్నపల్లె కొండపై ఉన్న శ్రీ కళ్యాణ వెంకట్రమణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తిప్రపత్తులతో ధ్వజారోహణం నిర్వహించారు. ఉదయం ఆలయంలో ఆలయ అర్చకులు మురళీకృష్ణాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకట్రమణస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. రామచంద్ర నాయుడు, నారాయణ మొదలి, క్రిష్టారెడ్డి, చిన్నపురం గ్రామస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు.

27న నక్కపల్లెలో జాతర

పలమనేరు: మండలంలోని నక్కపల్లెలో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు తిరుపతి గంగమ్మ జాతర నిర్వహించనున్నట్టు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. 27న అమ్మవారి శిరస్సు మెరవణి, 28న అమ్మవారి విశ్వరూప దర్శనం, 29న అమ్మవారి జలధి కార్యక్రమంతో జాతర ముగుస్తుందని తెలియజేశారు.

హంస వాహనంపై విహారం


హంస వాహనంపై శ్రీవారు

సదుం: మండలంలోని బూరగమంద శ్రీదేవీ భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేకాలంకారం, విశేష పూజలు చేశారు. రాత్రి ఉత్సవ మూర్తులను మేళతాళాలతో హంస వాహనంపై గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

తగ్గిన రిజిస్ట్రేషన్లు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో గంగజాతర..దీంతో పాటు మంగళవారం సెంటిమెంట్ మూలాన రిజిస్ట్రేషన్లు తగ్గాయి. సాధారణ రోజుల్లో చిత్తూరు అర్బన్, రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రోజు దాదాపు 50కి పైగా రిజిస్ట్రేషన్లు జరిగేవి. మంగళవారం కేవలం 18 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి. పలువురు పండుగ అని రిజిస్ట్రేషన్లు పెట్టుకోలేదు. బుధవారం ఓ మోస్తరుగా రిజిస్ట్రేషన్లు జరగవచ్చని అధికారులు చెబుతున్నారు. కొనుగోలు, అమ్మకందారులు తగ్గడంతో కార్యాలయాలు బోసిపోయింది.

అట్టహాసంగా గంగజాతర


అమ్మవారి శిరస్సు మెరవణి చేస్తున్న దృశ్యం


ఆలయం వద్ద మొక్కులు తీర్చుకునేందుకు వస్తున్న భక్తులు

- ఏక్కిలలే..ఏక్కిలలే...ఏక్కిలలే నినాదాలతో మార్మోగిన పలమనేరు
- అమ్మవారి విశ్వరూప దర్శనానికి పోటెత్తిన జనం
- పలమనేరు వీధుల్లో లక్షల్లో పగిలిన కొబ్బరికాయలు

పలమనేరు: ఏక్కిలలే..ఏక్కిలలే...ఏక్కిలలే నినాదాలతో మంగళవారం పలమనేరు గంగమ్మ భక్తుల నినాదాలతో మార్మోగింది. పట్టణంలో ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే తిరుపతి గంగమ్మ జాతర ఈ పర్యాయం ఎన్నికల కోడ్ నేపథ్యంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. దేదీప్యమైన కాంతులతో అమ్మవారు మంగళవారం తెల్లవారుజాము నుంచి గంగమ్మ తోపులో పుట్టినింట భక్తుల దర్శనార్థం కొలువు దీరారు. శిరస్సు మెరవణి తర్వాత అమ్మవారిని విశ్వరూప దర్శనానికి ఉంచారు. పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల భక్తులు సైతం పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో పట్టణం భక్తజన సంద్రమైంది.

భక్తిశ్రద్ధలతో శిరస్సు మెరవణి

అమ్మవారి బంగారు శిరస్సు సోమవారం అర్ధ రాత్రి పాతపేటలోని వేణుగోపాలస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు మంగళ వాయిధ్యాల నడుమ టీకే స్ట్రీట్, నేషనల్ హైవే, జవిళివీధి, బజారువీధుల మీదుగా సాగింది. ఊరేగింపులో ప్రతి ఇంటి వద్ద టెంకాయలు కొట్టి, హారతులు ఇచ్చిన, అమ్మవారి మొక్కులు చెల్లించారు. మరో వైపు మొక్కుబడి ఉన్న భక్తులు 101 టెంకాయలను కొట్టారు. అన్ని వీధుల్లో లక్షల్లో టెంకాయలు పగిలాయి. 30 పోలీస్ యాక్టు, పోలీసుల బందోబస్తుతో అమ్మవారి శిరసు మెరవణి ప్రశాంతంగా జరిగింది. ఎన్నికల కారణంగా వీఐపీ పాసులను ఎండోమెంట్ రద్దు చేసింది. భక్తుల కోసం రెండు క్యూలను ఏర్పాటు చేశారు. ఆలయంతో పాటు పట్టణంలో అవసరమైన చోట్ల మున్సిపల్ సిబ్బంది ముందస్తుగానే ఏర్పాట్లు చేశారు.

పట్టణంలో జాతర కోలాహలం

పలు చోట్ల స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాలు పానకం, మజ్జిగను, ప్రసాదాలతోపాటు పలు ఆలయాల వద్ద అన్నదానాలు చేశాయి. మున్సిపల్ కార్యాలయం వద్ద గాండ్ల సేవా సంఘం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేసింది. అలాగే గంగమ్మ ఆలయం వద్ద ఆర్య వైశ్య సంఘం, మదనపల్లె రోడ్డులోనూ అన్నదానం, స్థానిక పలమనేరు పరిరక్షణ సమితి భక్తులకు మజ్జిగ పంపిణీ చేసింది. విచిత్ర వేషధారణలు గతంలో కంటే ఈసారి తగ్గాయి.

నేడు జలధితో జాతర పరిసమాప్తం

ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ గంగమ్మ జాతర బుధవారం జలధితో ముగియనుంది. బుధవారం ఉదయం 5 గంటలకు అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి గాంధీనగర్ సమీపంలోని బావిలో నిమజ్జనం చేస్తారు.

సామాన్య భక్తులు ఫుల్ హ్యాపీ

గతంలో పాలక వర్గాలున్నప్పుడు వీఐపీ పాసుల పేరిట కావాల్సిన వారికి అమ్మవారి దర్శనం త్వరితగతిన చేయించేవారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల పేరిట రికార్డ్ డ్యాన్సులు, డీజేల హోరు, టపాసుల మోత, ఆకతాయిల గొడవలు, మందుబాబుల హంగామాలు లేకుండా ఎండోమెంట్, పోలీసుల ఆధ్వర్యంలో అమ్మవారిని సంతృప్తిగా దర్శించుకున్నామని సాధారణ భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

అమ్మవారి సేవలో..

చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, మడకశిర ఎమ్మెల్యే, తిప్పేస్వామి, పట్టణ ప్రముఖులు ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధా, రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పవిత్ర, మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, డీసీసీ సుధాకర్, గణేష్‌యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు, పట్టణ ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఎమ్మెల్యే వెంకటేగౌడ ఒక ప్రకటనలో ప్రజలకు గంగజాతర శుభాకాంక్షలు తెలిపారు.

జాతరోత్సాహం

- అంగరంగ వైభవంగా తిరుపతి గంగమ్మ శిరస్సు ఊరేగింపు
- మొక్కులు చెల్లించిన భక్తులు
- పొరుగు రాష్ట్రాల నుంచి భారీగా తరలి వచ్చిన భక్తజనం


పట్టణ వీధుల్లో ఊరేగుతున్న అమ్మవారు

కుప్పం: తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా మంగళవారం అమ్మవారి శిరస్సు ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. ఆలయ ప్రాంగణం నుంచి అమ్మవారి శిరస్సును కళ్ల తెరతో చెరువు కట్ట వద్ద ఉన్న పెద్ద బావి వద్దకు తీసుకెళ్లి, శాస్త్రోక్తంగా పూజలు చేసి, కళ్ల తెర తొలగించి ఊరేగించారు. బావి నుంచి రోడ్డుపై అమ్మవారి శిరస్సు రాగానే భక్తులు మొక్కులు చెల్లించారు. చెరువు కట్ట నుంచి విజయలక్ష్మీ రోడ్డు, మునుస్వామి పురం నేతాజి రోడ్డు, కొత్తపేట, ఆర్ఎస్ పేట పట్టణ సరిహద్దు వరకు ఊరేగించి తిరిగి ఆలయానికి బుధవారం ఉదయం తీసుకువస్తారు. ఊరేగింపులో భక్తులు ఇంటింటా అమ్మవారికి సారె సమర్పించి పూజలు చేశారు.

ఎటు చూసినా భక్తులే

అమ్మవారి శిరస్సు ఊరేగింపు వీక్షించేందుకు కుప్పం చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున్న భక్తులు తరలి రావడంతో పట్టణం జన సంద్రమైంది. నేతాజీ రోడ్డు, ఆర్ఎస్ పేట, మునుస్వామి పురం ప్రాంతంలో మంగళవారం ఉదయం ఇసుకేస్తే రాలని జనంతో నిండిపోయింది. అమ్మవారి పసుపు, కుంకుమ, సారెను పూజారులకు అందజేసి, శిరస్సు వద్ద ఉంచి, తమను చల్లగా చూడాలని భక్తులు పూజలు చేశారు. పట్టణం చుట్టూ భక్తులు షెడ్లు ఏర్పాటు చేసుకుని వంటలు చేసి అన్నదానం చేశారు.

పలక వాయిద్యాల హోరు నడుమ శిరస్సు ఊరేగింపు

అమ్మవారి శిరస్సు ఊరేగింపు పలక వాయిద్యాల నడుమ మంగళవారం ఉదయం 9 నుంచి మొదలైంది. రాత్రి అంతనూ ఇది కొనసాగి, బుధవారం ఉదయం 9 గంటలకు తిరిగి ఆలయానికి చేరుతుంది.

భారీ బందోబస్తు

జాతరకు 250 పోలీసులు బలగాలతో అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణ ప్రధాన కూడలి ప్రాంతాల్లో బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. హెచ్‌పీ రోడ్డు, నేతాజీ రోడ్డు, గాంధీ విగ్రహం సర్కిల్, బైపాస్ సర్కిల్ ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.

నేడు విశ్వరూప దర్శనం

కుప్పం: శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ అమ్మవారి విశ్వరూప దర్శనం బుధవారం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి శిరస్సు ఊరేగింపు ముగించుకుని బుధవారం ఉదయం ఆలయంలోకి అమ్మవారి శిరస్సు చేరుకున్నాక అర్ధరాత్రి వరకు భక్తులకు విశ్వరూప దర్శనం కల్పిస్తున్నట్టు చెప్పారు. అనంతరం అమ్మవారి శిరస్సు తొలగించి నిమజ్జనం చేస్తామన్నారు.


భక్తులతో జన సంద్రమైన కుప్పం

గంగమ్మకు అంబలి సమర్పణ

పులిచెర్ల(కల్లూరు): గంగజాతర సందర్భంగా మూడవ రోజు పులిచెర్లలో అంబలితో భక్తులు భారీగా తరలివచ్చారు. గంగమ్మ ఆలయం ముందు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ఆలయ ధర్మకర్తలు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ మురళీ మోహన్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాదమునిరెడ్డి, రాయల్ మోహన్, ప్రభాకర్, శ్రీధర్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు పొంగళ్లు

రొంపిచెర్ల: మండల ప్రజలు మంగళవారం గంగమ్మకు పొంగళ్లు పెట్టి, టెంకాయలు కొట్టి, మొక్కులు చెల్లించారు. స్థానిక ముత్యాలమ్మ ఆలయంలో పూజలకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అర్చకులు గుణశేఖర్ పూజలు చేసి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. పలువురు యువతీ యువకులు గంగమ్మ వేషాలతో ఆకట్టుకున్నారు.


పులిచెర్లలో గంగమ్మ ఆలయం ముందు భక్తులు

హనుమంత, గజ వాహనాలపై చిద్విలాసం


గజ వాహనంలో కనువిందు చేసిన శ్రీనివాసుడు

- సుమనోహరం..శ్రీనివాసుని వసంతోత్సవం


హనుమంత వాహనంపై కోనేటిరాయుని విహారం


స్వామివారికి నిర్వహిస్తున్న వసంతోత్సవం

గంగవరం: మండలంలోని కీలపట్లలో నిర్వహిస్తున్న శ్రీకోనేటిరాయుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో 6వ రోజు మంగళవారం స్వర్ణాలంకార భూషితుడైన శ్రీనివాసుడు ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజవాహనంపై గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. భక్తజన బృందాలు, కోలాటాలు, సంకీర్తనల ఆలాపన నడుమ వాహనాలపై స్వామివారు దేదీప్యమానంగా వెలుగొందుతూ భక్తులను అనుగ్రహించారు. తొలుత ఆలయంలో స్వామివారిని సుప్రభాతంతో మేలుకొలిపి తోమాలసేవ, సహస్ర నామార్చన నిర్వహించిన అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి అభిషేకించారు. తరువాత స్వామివారు దేవేరులతో వసంత మండపంలోకి వేంచేసి వసంతోత్సవం నిర్వహించారు. తరువాత పల్లకిలో కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. వాహన సేవల్లో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బ్రహ్మోత్సవాలలో నేడు

బుధవారం ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారు విహరిస్తారని టీటీడీ అధికారులు తెలిపారు. కంకణబట్టార్ ఏకే. నరసింహాచార్యులు, డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ పరిశీలన


ఇసుక రీచ్‌ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

తవణంపల్లె: మండలంలోని ఉత్తరబ్రాహ్మణపల్లె సమీపంలోని బహుదానదిలో ఇసుక రీచ్‌ని మంగళవారం జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పరిశీలించారు. అధికారుల అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే స్థానికులు అడ్డుకుని ఫిర్యాదు చేయాలని కోరారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు భూగర్భ గనుల శాఖ డీడీ కేఎల్ఎం ప్రసాద్, ఏఎస్పీ సుబ్బరాజు, జియాలజిస్టు పోలిరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈఈ మదన్‌మోహన్, డీపీఓ లక్ష్మి, ఆర్డీఓ ఆఫీస్ ఏఓ విజయభాస్కర్, తహసీల్దార్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ




పలమనేరు: పంపిణీకి సిద్ధం చేసిన వేరుశనగ విత్తనకాయల బస్తాల వద్ద అధికారులు, రొంపిచెర్లలో రైతులకు పర్మిట్లు ఇస్తున్న ఏఓ శ్రీనివాసులు

పలమనేరు: మండలంలోని రైతులకు గురువారం నుంచి ఆయా రైతుభరోసా కేంద్రాల్లో సబ్సిడీ వేరుశన విత్తన కాయలను పంపిణీ చేయనున్నట్టు మండల వ్యవసాయాధికారిణి సంధ్యారాణి తెలిపారు. మండలంలోని 12 ఆర్బీకేలలో మండలానికి సంబంధించి 1,035 క్వింటాళ్ల విత్తన కాయలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. 30 కిలోల బస్తా సబ్సిడీ పోను రూ.1710 లకే ఇవ్వనున్నట్టు చెప్పారు. అవసరమైన రైతులు తమ పాసు పుస్తకం జెరాక్స్, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్‌ను తెచ్చి బయోమెట్రిక్ ద్వారా పొందాలని కోరారు.

సదుంలో..

సదుం: మండలంలో గురువారం నుంచి రాయితీ వేరుశనగ విత్తన కాయల పంపిణీ చేయనున్నట్టు ఏఓ హరిప్రసాద్ తెలిపారు. విత్తనాలు అవసరమున్న రైతులు ఆర్బీకేలలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. బయోమెట్రిక్ విధానంలో మాత్రమే విత్తన కాయలు పంపిణీ చేస్తామన్నారు. రైతులు పంట సాగు చేస్తామని డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం కదిరి రకం 1100 క్వింటాళ్లు, నారాయణి రకం 105 క్వింటాళ్లు ఆర్బీకేలలో ఉన్నాయని, బుధవారం మరో 300 క్వింటాళ్లు వస్తాయని చెప్పారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంపిణీ చేయడానికి వేరుశనగ విత్తన కాయలు సిద్ధంగా చేశామని, 23వ తేదీ నుంచి ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో వీటిని పంపిణీ చేయనున్నట్టు మండల వ్యవసాయశాఖాధికారి నాగరాజు తెలిపారు. మండలంలోని 570 హెక్టార్లలో వేరుశనగ విత్తనాలు వేసేందుకు 540 క్వింటాళ్లు అందుబాటులో ఉంచామన్నారు. 30 కేజీల వేరుశనగ కాయల విత్తనాల ధర రాయితీపోను రూ 1710 చెల్లించి రైతులు తీసుకోవాలన్నారు. అలాగే 10 కిలోల జనుము, జీలుగ విత్తనాలు కూడా 50 శాతం రాయితీపై పొందవచ్చన్నారు. వేరుశనగ కాయలు కావలసిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ జెరాక్సు ఆర్బీకేలో ఇచ్చి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

రైతులకు విత్తన పర్మిట్లు

రొంపిచెర్ల: ఖరీఫ్ సీజన్ వేరుశనగ పంట సాగు చేసే రైతులకే సబ్సిడీ వేరుశనగ విత్తనాలు ఇస్తామని ఏఓ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన రొంపిచెర్ల, బొమ్మయ్యగారిపల్లె రైతు భరోసా కేంద్రాలలో రైతులకు విత్తన పర్మిట్లు ఇచ్చారు. ఎకరా పొలంలో కనీసం 55 కిలోల వేరుశనగ విత్తనాలు విత్తుకోవాలని, విత్తనాలు వేసేటప్పుడు ఎకరాకు 2 బస్తాల జిప్సం వేయాలని రైతులకు సూచించారు. దీని వలన వేరుశనగ కాయలు నాణ్యతగా ఉంటాయని అన్నారు. అలాగే విత్తన శుద్ధి చేసిన తర్వాతే విత్తనాలు విత్తుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది వెంకటరమణ నాయక్, నర్మద, మహిళా పోలీసు రేష్మా తదితరులు పాల్గొన్నారు.


సదుం: విత్తనాల స్టాకు పరిశీలిస్తున్న ఏఓ హరిప్రసాద్


గుడుపల్లె ఆర్బీకేలో ఉన్న వేరుశనగ కాయల విత్తనాలు

అధికారంలోకి రాలేమని విదేశాలకు జంప్

- చంద్రబాబు, లోకేష్‌పై వైఎస్సార్ సీపీ నేత విసుర్లు


మీడియాతో మాట్లాడుతున్న గజేంద్ర ప్రసాద్

పలమనేరు: ఎన్నికల్లో ఎలాగూ అధికారంలోకి రాలేమని తెలిసే టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ గుట్టు చప్పుడు కాకుండా విదేశాలకు చెక్కేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆకుల గజేంద్ర ప్రసాద్ విసుర్లు విసిరారు. మంగళశారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. విదేశాలకు ఎందుకు వెళ్లారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ఫలితాలు రాకనే టీడీపీ వారు తాము గెలిచినట్లు పగటి కలలు కంటున్నారని అపహాస్యం చేశారు. ప్రజలంతా తమ పక్షానే ఉన్నారని, మళ్లీ వైఎస్సార్ సీపీనే అధికారంలోకి రావడం తథ్యమన్నారు. రాష్ట్రంలో 85శాతం మంది మహిళలకు జగనన్న పాలనలో సంక్షేమ పథకాలందాయని, ఇక వృద్ధులు తమ పక్షానే ఉన్నారని, బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీలు, వైఎస్సార్‌సీపీ సాంప్రదాయ ఓటర్లు తమకు మద్దతుగా ఉన్నారని స్పష్టం చేశారు. విదేశాలకు ఎవరైనా మంత్రి పెద్దిరెడ్డిపై కువిమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ అమరావతి

బంగారుపాళెం: ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి, అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఎంపీపీ అమరావతి సూచించారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న కారణంగా ప్రధాన సమస్యలపైన చర్చ సాగింది. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వైద్య, ఆరోగ్య, వ్యవసాయం, విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై అధికారులు సమావేశంలో సమీక్షించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులను అధికారులు తమ పరిధిలో ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీలు శిరీష్‌రెడ్డి, జయకుమార్, కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అమరనాథ్, ఎంపీడీఓ శివశంకర్, తహసీల్దార్ సుబ్రమ్మ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.